
# నేను సైతం

## కథ

దొరై రాజ్

''చేసుకున్నోళ్ళకు చేసుకున్నంతని... ఏంజెప్పమంటావు రంగమ్మత్తా, పేరుగొప్ప ఊరు దిబ్బ. లక్షల్లో వొచ్చే సంపాదనంతా ఏమై పోతా ఉందో. అది తలుచుకునే ఈ బాధ. ఊర్లో చీమ చిటుక్కుమన్నా ఎవరో ఒకరు జాబు రాసిపడేస్తారు. ఖర్చయ్యే పనంతా మా మిందేపడాల. నువ్వు చెప్పత్తు. ఇప్పుడు కూడా ఆ జాబు చేతిలో పడింది. ఇట్ల నాకు తెలీకుండా ఎన్ని జాబు లొస్తుండాయో... ఎంత డబ్బు పోతా ఉందో...''



ఆనకట్టలేని ఈ మాటల ప్రవాహం వస్తున్నది లక్ష్మి నోటి వెంటే, అప్పుడే ఇంటికొచ్చిన నాకు మంటల చిటపటలతో స్వాగతం లభించింది. రంగమ్మత్త అనబడే మా పక్కింటావిడ బహుశా కాఫీ పొడికో, చక్కెర చేబదులుకో వచ్చినట్లుంది. లక్ష్మి మాటలను బాగా ఇన్‌వాల్వయి వింటోంది. ఆ వినడం లక్ష్మిని బాగా మోటివేట్ చేసిందేమో రెట్టింపు ఉత్సాహంతో చెపుతోంది. ఇలాంటి స్వాగతాలు నాకు అరుదుగా లభిస్తుంటాయి. ముఖ్యంగా లక్ష్మికి ఏదైనా మాట ఇచ్చి మరచిపోయినపుడో, ఆఫీసు పనుల్లో పడి ఆలస్యంగా ఇంటికి వచ్చినపుడో ఇది సహజం. ఇపుడు ఈ స్వాగతం ఉరుములూ, మెరుపులూ లేని కుంభవృష్టి లాంటిది. నా ఎంట్రీ గమనించీ, గమనించినట్లే మాట్లాడుతోంది లక్ష్మి. ఆ ఉధృతి ఆపే ప్రయత్నం చేస్తే జరిగే ప్రమాదం నాకు కొత్తకాదు. అందుకే ఆ సాహసం చేయలేదు.

రంగమ్మత్త అనబడే శ్రోత తన పని పూర్తి చేసుకున్నట్లుంది. నేనొచ్చినట్లు లక్ష్మికి సింబాలిక్‌గా కమ్యూనికేట్ చేసి చిన్నగా జారుకుంది. ''అయ్యో! ఎంతసేపయిందండీ మీరొచ్చి, గమనించనేలేదే...'' అంటూ నీళ్ళ గ్లాసుతెచ్చి టేబుల్‌పై పెట్టి మౌనంగా వంటింట్లోకి వెళ్ళిపోయింది. నీళ్ళందుకుంటుంటే పక్కనే నా పేరుతో ఉన్న ఉత్తరం కన్పించి అటూ ఇటూ తిప్పి చూశా. ఊర్నుంచి షమీ రాసిన ఉత్తరం.

పై సంఘటనకు కేంద్ర బిందువు చూచాయగా అర్థమైంది. ఊర్నుంచి ఉత్తరం అంటే నేను డబ్బులు పంపుతానని లక్ష్మి అనుమానం. అందుకే ఈ ఉపోద్ఘాతం. ఉత్తరం చదవడం మొదలుపెట్టా.

పూలు విచ్చుకున్నంత స్వచ్ఛంగా, సముద్రం పరుచుకున్నంత విస్తారంగా మిత్రుడు రాజుకు షమీ ఛేయు నమస్సులు–

లక్ష్మి మాటల ప్రళయ ప్రవాహంతో హడలిన నాకు షమీ ఉత్తరం కాస్త సాంత్వన కలిగించింది. నా చూపులు ఉత్తరంలోని అక్షరాల వైపు పరుగు తీశాయి...

''మీ ఉత్తరం ఆసాంతం చదివాను. నాపట్ల మీరు చూపుతున్న ఆత్మీయతకు ముగ్ధుడనై మైనపు వత్తిలా కరుగుతున్నాను. మీకు నా మంగళకర ధన్యవాదాలు ఎలా తెలుపుకోవాలో...? క్షమిస్తానని మాట ఇస్తే నాలో విచ్చుకున్న మాటల నిక్షేపాన్ని తెలుపుతాను. అన్యథా భావించకండి. నాకు మీరిచ్చిన సలహా అభినందించదగినది. లెక్కల్లో నాకున్న పట్టు, నా టీచింగ్ సామర్థ్యంపై మీకున్న నమ్మకానికి కృతజ్ఞతలు. మీ నుండి వచ్చిన ఈ అభినందన నా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. నేను సిటీకి వచ్చి ఏ కార్పొరేట్ కోచింగ్ సెంటర్లో ట్యూటర్‌గా చేరినా నెలకో పాతికవేలు సంపాదించవచ్చని, నా భార్య పిల్లలకు ఆధునిక జీవితం అందించవచ్చని నేను ఆధునిక జీవితం అనుభవించవచ్చని సలహా ఇచ్చారు. నా బాల్యంలో నేనెంత దుర్భర జీవితం గడిపానో ఈ మాత్రం చదువుకోవడానికి నేనెంత కష్టపడ్డానో మీరు గుర్తు చేశారు. నాలాంటి జీవితం నా పిల్లలకు రాకూడదని సలహా ఇచ్చారు. ఒకమాట, మన ఊర్లో ఉన్న పిల్లలందరికీ అలాంటి జీవితం రాదు కదా! నాలాంటి జీవితం నా పిల్లలకే కాదు, మన గ్రామంలోని ఏ పిల్లలకూ రాకూడదని నా కోరిక.

మీరిప్పుడు ఆలోచించిన రీతిలో పాతిక సంవత్సరాల క్రితం మన మాస్టార్లు ఆలోచించి ఉంటే మనం ఈ స్థాయికి రాగలిగేవాళ్ళమా! వారు ఏ ప్రయోజనం ఆశించి మనకు చదువు చెప్పారు. మనం అన్ని మార్కులు సాధించామంటే ఏ కార్పొరేట్ స్కూల్లో చదివాము. అక్షరం ముక్కరాని మన తల్లిదండ్రులు మనల్ని ఎంత ప్రభావం చేయగలిగారు? వారి త్యాగాన్ని మనం మరువగలమా!

నేడు పల్లెల్లోని ప్రభుత్వ పాఠశాలలను గమనిస్తే అందులో చదువుతున్న వారు కార్పొరేట్ స్కూళ్ళలో చదువుతున్న వారితో ఏ రకంగా పోటీ పడగలరు? ఈ అంతరం భర్తీ చేయగలమా? మన చుట్టు పక్కల గ్రామాల్లో ఏ స్కూల్‌లోనూ సరైన వసతులు లేవు! 'చెట్టుకిందే చదువు, వర్షం కురిస్తే సెలవు' వీరినిలాగే వదిలేస్తే భవిష్యత్తరాలను మనం ఊహించలేం. భవిష్యత్తులో ఈ రెండు వర్గాల మధ్య వచ్చే అగాథం పూడ్చలేనిదిగా ఉంటుంది. మీ సలహా వ్యక్తిగతంగా నాకు ఏ సంతృప్తినివ్వదు. నా జీవితంలో పిల్లలకు అధిక ప్రాధాన్యతనిస్తాను. కారణం నా బాల్యం నాకందించిన చేదు అనుభవాలే.

గత సంవత్సరం మన ఊర్లో ఒక వాన చినుకూ పడలేదని మీకు తెలుసా! తాగే నీరు కరువైంది. పంట భూములు బీడు భూములై జీవించడం కష్టమైన రైతు కూలీగా మారి, అదీ కుదరక ఆత్మహత్యకు పాల్పడుతున్న తరుణంలో వారి పిల్లలకు మంచి విద్య ఎలా అందివ్వగలడు. ఈ చుట్టు పక్కల గ్రామాల్లోని స్కూళ్ళలో టీచర్లు పిల్లల చదువు పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. చదువు చెప్పాలన్న తపన ఉన్న టీచర్లు కూడా రాజకీయాల ప్రభావంతో చదువు చెప్పలేక పోతున్నారు. ఈ పదవ తరగతి పరీక్షల్లో నా దగ్గర చదువుకున్న పిల్లలు మంచి మార్కులతో పాస య్యారు. వారి ఆనందం తృప్తి వర్ణించలేనివి.

జీవితంలో ఇంత దూరం ప్రయాణించాక ఒకసారి వెనక్కు తిరిగి చూసుకుంటే, మనం సాధించిందేమిటన్న ప్రశ్న ఉదయిస్తుంది. అందుకే రేపటి పౌరులకేమైనా చేయాలి. అది కూడా మన ఊర్లో మొదలవ్వాలి. ఇక్కడి పిల్లలు ఉన్నత విలువలతో పెరగాలి. ఒకతోట అందంగా కనువిందు చేయాలంటే అందులోని పూలమొక్కల్ని చక్కగా పెంచాలి. సమాజం సుందరంగా ఉండాలంటే రేపటి పౌరులు సంస్కారంతో పెరగాలి.

నా దగ్గర చదువుకుంటున్న వీరంతా అలాంటి సంస్కారాలతో అత్యున్నత శిఖరాలకు చేరుకోగలరన్న నమ్మకం నాకుంది. గ్రామీణ వాతావరణం నుండి ఆ స్థాయికి ఎదిగే వీరు మాత్రమే గ్రామసీమలకు న్యాయం చేయగలరు. మరో విషయం మన ఊర్లోని బడికి పక్కా భవనం లేదు. ఊరి ముందున్న చింతచెట్టూ, ఊరవతలి భజన గుడి బడిగా ఉన్నాయి. ఈ నేలలో పుట్టి ఉన్నత పదవులలో ఉన్న వారు మన ఊరి బడి గురించి ఆలోచించడం లేదు. ఈ సెలవుల్లో పిల్లలు తమ స్వయంకృషితో రెండు గుడిసెలు కడుతున్నారు. వీరి ఉత్సాహం పట్టుదల చూసి కొందరు యువకులు తమకు తోచిన సహాయం అందిస్తున్నారు. నేను, నా శ్రీమతి, ఊళ్లో కొంత మంది యువకులు, పిల్లలూ కలిసి రెండు నాటకాలు ప్రదర్శించాము. కొంత డబ్బు పోగయింది. ఈ చిన్నారులు తమ లేత చేతులతో పనులు చేస్తుంటే హృదయం ద్రవిస్తోంది. అయినా అంతిమ లక్ష్యం సాధించడానికి హృదయాన్ని గట్టిపరచుకుంటున్నాము. మీలాంటి పెద్దల సహాయం అర్థించమని కొందరు సలహా ఇచ్చినా చేయిచాచి అడగలేని అశక్తత ఏదో ఆవరించి అడుగు ఆ దిశగా ముందుకు వేయలేకపోతున్నాము.

మీ సహృదయతకు నేను సదా కృతజ్ఞుడను. ఈ సెలవుల్లో కలుసుకుందాం! మీ శ్రీమతికి, పిల్లలకు నా ఆశీస్సులు.

మీ శ్రేయోభిలాషి.
షమీ.

ఉత్తరం చదివాక మనసు భావాతీతమైన శూన్యానుభూతికి లోనైంది. ఆలోచనామథనం మొదలైంది. నా గతం కన్నా భిన్నమైంది కాదు. అది నాకు, షమీకి తెలుసు. ఎటొచ్చీ తెలియనిది నా భార్యాపిల్లలకు, నా చుట్టూ ఉన్న ప్రపంచానికి మాత్రమే. నా ఆలోచనలకు, షమీ ఆలోచనలకు పోలిక ఎక్కడుంది. సమాజంలో షమీలా ఆలోచించే వాళ్ళెంతమంది!

నేను నా కుటుంబం లగ్జరీగా ఉండడానికి ఎంత ఖర్చు పెడుతున్నాను. నా చుట్టూ ఉన్నవారంతా నాలా ఖర్చు పెట్టే స్థాయికి ఎదగాలన్న ఆలోచన, కోరికా నాకెప్పుడూ కలగలేదు. నా గతాన్ని, బాల్యాన్ని నేను మరిచాను. అందుకే విశాలదృక్పథంతో ఆలోచించలేకపోయాను. కళ్ళ ముందు క్రమంగా చీకటిపొరలు కమ్ముకున్నాయి. భుజంపై చల్లగా నీటి చుక్కలు పడినట్లయి ఉలిక్కిపడ్డాను. ఎప్పుడు వచ్చిందో నా వెనుకే నిలబడి ఉంది లక్ష్మి. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. నాలో ఆవేదన, బాధ లక్ష్మిలో వచ్చిన మార్పుకు ఆనందం కలగలిసి ఉక్కిరిబిక్కిరి చేశాయి. కళ్ళు తుడుచుకుంటూ ఆ రోజుటి న్యూస్ పేపర్ నా చేతిలో పెట్టి ఒక న్యూస్ ఐటమ్ చూపించింది లక్ష్మి. కేరళలో ఓ కుగ్రామంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని అమెరికాలో స్థిరపడి అక్కడే వందల కోట్ల రూపాయలు సంపాదించిన 'డాక్టర్ కుమార్ బహులేయాన్' తను పుట్టి పెరిగిన గ్రామానికి ఎనభై కోట్ల రూపాయలు వెచ్చించిన విషయం తెలియజెప్పే వార్త. మనసు మురిసి, కళ్ళు తెరిపించే వార్త.

ఏ రకమైన ఆర్థిక వనరులూ లేకుండా, ప్రాథమిక అవసరాలను తీర్చుకోలేని పరిస్థితిలో కూడా పది మంది పిల్లలను తేజోవంతులుగా తీర్చిదిద్దుతూ సంతృప్తిపడుతున్న షమీ–

జీవితకాలం పరాయిగడ్డపై కష్టించి, సంపాదించిన వందల కోట్ల రూపాయలను తనకు జన్మనూ, జీవితాన్ని ప్రసాదించిన గ్రామానికి దారాదత్తం చేస్తున్న కుమార్–

ఇద్దరూ భిన్నధృవాల్లో ఉన్న మహానుభావులే. మరి నేనెక్కడ, షమీ చేస్తున్న యజ్ఞంలో నేనెందుకు భాగం కాకూడదు. కుమార్ అంతటి సంపాదన లేకపోయినా, షమీకన్నా ఎన్నో రెట్లు మెరుగైన జీవితం నాది. నేను ఎంతో చేయవచ్చు... ఆలోచనలు సాగిపోతున్నాయి.

లక్ష్మి మబ్బులు వీడిన నీలాకాశంలో చందమామలా ప్రకాశిస్తోంది. సాయంకాలపు నీరెండ స్వచ్ఛంగా, ఆహ్లాదకరంగా ఉంది. తదేకంగా ఆమెనే చూస్తున్న నన్ను చూసి నవ్వుతూ కనుబొమ్మలెగరేసింది లక్ష్మి తదుపరి కార్యక్రమం ఏమిటన్నట్లు. ఆమె ఆశించిన స్పందన నా నుండి రాలేదేమో–

నా భుజం చరిచి చూపుడు వేలితో ఆ న్యూస్ ఐటమ్‌ను, షమీ ఉత్తరాన్ని చూపిస్తూ ''ఈ శనాది వారాలు మనం ఊరెళుతున్నాం, షమీని కలుస్తున్నాం; ఇకపై ప్రతి రెండవ శనివారాలు మన క్యాంప్ అక్కడే అంటూ నా గమ్యాన్ని గుర్తు చేసింది.

★